**జనపథం - జనపదం**

# కొసరు

**- నిత్యానంద్.**

కొసరు అనే పదం తెలియని తెలుగువారు ఉండరేమో కదా! 'కొస' అంటే చివర అని. చివరన అడిగేది కొసరు. "ఓ కూరలబ్బాయ్! వంకాయలెలా?" అడిగిందో ఇల్లాలు. "కిలో ముప్పై రూపాయలమ్మ!" సమాధానం. "ఇరవై ఐదు చేసుకో!", "గిట్టదమ్మా". "పోనీ ఇరవై ఆరు". "మేము కొనేదే ఇరవై ఎనిమిదికమ్మా! ఇరవై తొమ్మిదికి తక్కువకి ఇవ్వలేనమ్మా!" మర్యాదగానే చెప్పాడు కూరలబ్బాయి. కొన్న సరుకును అమ్మడానికి బుట్టల్లో వేసుకుని, బండిలో వీధి వీధి తిరిగి అమ్మడానికి పడే శ్రమకి చూస్తూ చూస్తూ ఓ రెండు రూపాయలు ఇవ్వడానికి ఒకటికి రెండుసార్లు బేరమాడే ఆ వనిత - ఏ కలక్టరాఫీసులోనో పని కావాలంటే అడక్కుండానే ఆ బిల్ల బంట్రోతుకు పదో పరకో (ఈ రోజుల్లో - వచ్చే లాభంలో పర్సంటేజి లెక్కనే పుచ్చుకుంటున్నారనుకోండి!) ఇవ్వడంలేదా! చివరికి ఇరవై ఎనిమిదీ ముప్పావళాకి బేరం ఒప్పించి - ఒలింపిక్స్లో గోల్డుమెడల్ సంపాదించిన ఆనందంతో ఓ అర్ధ కిలో తూపించి, "అదేంటబ్బాయ్! ఆ రెండు కాయలు ఉంచు" అని కొసరు ఇప్పించుకునే సన్నివేశాలు (కూరలబ్బాయి తలగోక్కుంటూ "పొద్దున్నే ఏం బేరం తగిలిందిరా దేముడా!" అని మనసులోనే అనుకోవడం - మనస్సాక్షిగా) మనకందరికీ చిరపరిచితమే!

వడ్డించేవాడు మనవాడైతే పంక్తి చివరన కూర్చున్నా పరవాలేదనేది మనకి తెలియని విషయం కాదు. పంచభక్ష్య పరమాన్నాలతో వడ్డించినా, కొసరి కొసరి వడ్డించకపోతే కొంతమందికి రుచించదు. "మొహమాట పడకండి! మరో రెండు గారెలు వడ్డించనీయండి! ఇలా నోట్లో పెట్టుకుంటే అలా కరిగిపోతాయి.", "అరరె! అప్పుడే అయిపోయిందా!! ఈ రెండు బూరెలు తినండి. హేమా! ఈ బూరెలలోకి కాస్త నెయ్యి వడ్డించమ్మా!" అంటూ వడ్డిస్తుంటే భరద్వాజ విందులా (త్రేతాయుగంలో విషయాలు గుర్తులేనివారికి - జయలలిత విందు, లల్లూ ప్రసాద్ యాదవ్ విందులా) వుందని ప్రస్తుతించడం సాధారణమే కదా! ఈ సందర్భములో మా గురువుగారు చెప్పిన ఓ చిన్న సన్నివేశం గుర్తు వస్తోంది. "ఓ వ్యక్తి డాక్టరు దగ్గరకి వచ్చి "అయ్యా! నాకు విపరీతమైన కడుపునొప్పిగా ఉంది. ఏదైనా పరిష్కారము చెప్పండ"ని మొరపెట్టుకున్నాడు. అతనిని పరిక్షించిన డాక్టరు, అతని ఉదరము 'ఉదజని వాయువుచే నిండిన బుడగ' (Hydrogen Balloon) మాదిరిగా ఉందని గ్రహించినవాడై - ఇక ఏమాత్రం పదార్థమైనా అందులోకి వెళితే - అది బెలూన్ మాదిరి పగులుతుందని తలచి, దీపావళికి మతాబులలో మందు దట్టించినట్లు - కూరికూరి, అర్ధ సెంటీమీటరు కైవారం కూడా ఖాళీ లేని దాని స్థితికి కారణమేమని ప్రశ్నించగా - ఆ వ్యక్తియునూ ఒక్కసారి దీర్ఘముగా నిట్టూర్పు విడచి ఇట్లనెను. "డాక్టరుగారూ! మా ఊరి మోతుబరి ఈ రోజు అన్న సంతర్పణ గావించుచున్నాడు. కొసరి కొసరి

వడ్డిస్తుండడంతో గారెలను, బూరెలను ప్రీతితో తిన్నాను. తరువాత చేయి కడుగుకొని లేచినప్పుడుగాని ఈ నొప్పిని గమనించలేద"ని వినయముగా సమాధానము చెప్పగా, డాక్టరున్నూ ఓ ఔషదం వ్రాసి ఇచ్చి, ఓ రెండు మాత్రలను అరగ్లాసు నీళ్ళతో వేసుకొమ్మని సలహా ఇవ్వగా, "ఆ మాత్రం ఖాళీ ఉంటే మరో గారె తిని ఉండేవాడిని కదా!" అని వెల్లడించిన ఆ వ్యక్తిని చూసి డాక్టరు ముక్కుమీద వేలు వేసుకున్నాడట!

కోటి రూపాయలు పెట్టి కొనబోతున్న ఇంటి విషయంలో కూడా వెయ్యి తగ్గించమని, రెండు వేలు తగ్గించమని బేరం ఆడేవారు నూటికి తొంబై తొమ్మిది మంది. వడ్డీ వ్యాపారం చేసే వారికి వారిచ్చిన లక్ష అసలు కంటే, నెలనెలా వచ్చే వడ్డీ పైనే మక్కువ. సంవత్సరానికి లక్ష డాలర్లు సంపాదించే ఉద్యోగికి - సంవత్సరానికి ఒకసారి వచ్చే ఎనిమిది వందల డాలర్ల బోనస్‌పై మమకారం ఎక్కువ. ఇలా చెప్పుకుంటూ పోతే అది రాయలసీమ చాంతాడు అంత అవుతుంది. ఇక అసలు విషయానికి వస్తే - మనకి చిన్నతనం నుండి అందిన దానికి ఆనందం కంటే మరింత కావాలనే తపన కలిగే సందర్భములే ఎక్కువ. చివరికి మనము ఈ కొసరు అడగడం అనేది సాక్షాత్తూ భగవంతుడు ఎదురుపడినా మానుకోలేకున్నాము. చదువుకున్నప్పుడు ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలని, చదువయ్యాక త్వరగా మంచి ఉద్యోగం రావాలని, ఉద్యోగం వస్తే ప్రమోషన్ రావాలని ఇలా ఒకదాని తరువాత ఒకటి అడగడమే. వచ్చినదానికి ఆనందపడడం, ఆ భగవంతునికి ధన్యావాదములు తెలపడం ఇంచుమించుగా మరచిపోయామనే చెప్పాలి. ఉద్యోగం వస్తే నీ కొండకు వస్తాము అనో, పరీక్ష పాసయితే తలనీలాలు సమర్పిస్తామనో మొక్కుకుని - మొక్కుతీర్చుకుని చేతులు దులుపుకోడం మనము చూస్తున్నదే. నాకు లక్షల్లో వస్తే, నీకు వందల్లో ఇస్తాను అని భగవంతునితో బేరసారములు కొనసాగించే నేటి తరానికి - తృప్తి వల్ల కలిగే మనశ్శాంతి అనుభవమయ్యేదెప్పుడో కదా! కోరుకుని రాకపోతే బాధగాని, కోరకుండానే మనకి సంప్రాప్తిస్తే కలిగే ఆనందం చెప్పడానికి సాధ్యమా! భగవంతునికి భక్తితో ఫలహారమును సమర్పించిన భక్తులు "ఇంకొంచెం తినవయ్యా. మళ్ళీ ఆకలేస్తుందేమో! మళ్ళీ తెల్లవారితేగాని, నీకు అభిషేకము జరిపిస్తేగాని నైవేద్యం సమర్పించమాయె!" అని కొసరి కొసరి తినిపించడం మనము విన్నదే కదా! ఎంతో మంది భక్త శిఖామణులు భగవంతుని లాలించి, బుజ్జగించి తినిపించి - అలా తినకపోతే అలిగి "నీవు తినేవరకు నేను పచ్చి మంచినీరు కూడా ముట్టను" అని పట్టుబట్టి భగవత్సాక్షాత్కారాన్ని పొంది జీవన్ముక్తులయ్యారు. కనీసం విశ్వవ్యాపి అయిన భగవంతుని విషయములో శ్రద్ధాభక్తులతో హృదయ(**కుసుమ**)మును, కృతజ్ఞతనిండిన హృదయంతో, ప్రేమ స్వరూపి అయిన ఆ జగన్నాధుని ప్రేమకై ఆర్తి నిండిన కన్నీళ్ళ(**తోయం**)తో, మనం చేసే ప్రతి పనిని, దాని ఫలిత(**ఫల**)మును కొసరి కొసరి సమర్పించుకుందాం! ఉన్నత గతుల్ని పొందుదాం! సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు!

**కొస**మె**రు**పు : ఇంకొన్ని లైన్లు వ్రాస్తే బాగుండేది అని మాత్రం అనకండి. మోతాదు ఎక్కువైతే అది మోదాన్నివ్వదు. అందరికీ ఆమోదం కూడా కాదు. ఆముదప్రాయం కదా! సెలవా మరి.

*** *** ***